
# ప్రతిభకు భారీ ప్రోత్సాహం

## ఏడిద విద్యార్థులకు.. రూ 14 లక్షల నగదు పురస్కారాలు..



మండపేట (బిఎన్ఎస్)జూలై 16: ఏడిద జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం రావు భారీ నగదు పురస్కారాలు అందజేశారు. ఇంటర్మీడియట్‌లో ప్రథమ స్థానాలు సాధించిన పంతంగి రమ్యశ్రీ 976,ఎం మేఘన 976 లకు ఒక్కొక్కరికి రూ5 లక్షల చొప్పున మొత్తం 10 లక్షలు అందజేశారు.పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన ఏ పవన్ కళ్యాణ్ 556 కు రూ 2 లక్షలు, మండపేట డాక్టర్ పాలడుగు చంద్రమౌళి బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థిని బావిక పదవతరగతి లో 592 మార్కులు మండలంలో ప్రథమ స్థానం సాధించినందుకు రూ 2 లక్షలు అందజేశారు.ఈ సందర్భంగా పురుషోత్తం రావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

గత నాలుగు సంవత్సరాలుగా ఇదే విధంగా భారీ పురస్కారాలు అందజేస్తున్నారని ఈ ఏడాది రూ 14 లక్షలు ఇవ్వడం గర్వకారణమని మాజీ సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, చిలుకూరు శ్రీనివాసు లు తెలిపారు. మండపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థినిని గుర్తించడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకటరాజు అన్నారు.ఈ కార్యక్రమంలో ఏం ఇ ఓ నాయుడు రామచంద్రరావు, ప్రధానోపాధ్యాయులు చింతా జయలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మియాపూర్ పరిధిలో దోపిడీ నిందితుడి అరెస్టు

మియాపూర్, జూలై 16: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని పోలీసులు అరెస్టు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వరుస నేరాలకు పాల్పడుతున్న బసోడి అభిషేక్ అనే నిందితుడిని మియాపూర్ పోలీసులు ప్రత్యేక చొరవతో దర్యాప్తు చేపట్టి పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు కూకట్‌పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఒక ప్రకటనలో తెలిపారు.




ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ డెలివరీ బాయ్‌పై జరిగిన దాడి ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. ఒక డెలివరీ బాయ్ బ్యాటరీ బైక్‌పై శిల్పా అవెన్యూ కాలనీ వద్దకు వెళుతుండగా, స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతనిని అడ్డగించారు. బాధితుడిపై భౌతికంగా దాడి చేసి, చంపేస్తామని బెదిరించి, అతని మొబైల్ ఫోన్‌ను బలవంతంగా అన్‌లాక్ చేయించారు. ఆపై అతని బ్యాంక్ ఖాతా నుండి రూ.900 ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసుకోవడమే కాకుండా, జేబులో ఉన్న రూ.5,000 నగదును లాక్కుని పరారయ్యారు. పోలీసుల విచారణలో పట్టుబడిన నిందితుడు బసోడి అభిషేక్‌కు పెద్ద నేర చరిత్ర ఉన్నట్లు వెల్లడైంది. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో సహచరులతో కలిసి ఇతడు రాత్రి వేళల్లో దోపిడీలకు పాల్పడేవాడని పోలీసులు పేర్కొన్నారు. గతంలో ఇతనిపై మధురానగర్, మియాపూర్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లలో పలు దోపిడీ కేసులు నమోదై ఉన్నాయని, ప్రస్తుతం ఇతనితో పాటు నేరంలో పాల్గొన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. ప్రయాణాల సమయంలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, ప్రజల అప్రమత్తతతోనే నేరాలను అరికట్టవచ్చని డీసీపీ స్పష్టం చేశారు.

# కోనసీమలో మట్టి మాఫియా బరితెగింపు..! స్మశాన భూములను సైతం వదలని అక్రమార్కులు.. మృతుల అస్థికలకు అవమానం..!






అయినవిల్లి(బీఎన్ఎస్)జూలై :16కోనసీమ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాల మాఫియా రోజు రోజుకు బరితెగిస్తోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి, ఇసుక తవ్వకాలు నిర్వహిస్తూ సహజ వనరులను దోచుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ దందాకు రాజకీయ అండదండలు ఉన్నాయనే విమర్శలు కూడా ప్రజల నుంచి వస్తున్నాయి. అయినవిల్లి మండలం మడుపల్లి లంక ప్రాంతంలో అక్రమంగా మట్టి, బోండు ఇసుక రవాణా జరుగుతోందనే సమాచారం మేరకు కొత్తపేట ఎస్సై జి. సురేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి సుమారు 11 గంటలకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాడపాలెం--బండారుపేట పరిధిలో అక్రమ మట్టి రవాణాకు ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్న నాలుగు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకుని కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు గన్నవరం నియోజకవర్గంలోని మడిపల్లి గ్రామంలో కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రాత్రి వేళల్లో స్మశానం(రుద్ర) భూమిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే, ఈ అక్రమ తవ్వకాల కారణంగా స్మశానం భూమిలో అంత్యక్రియలు నిర్వహించిన మృతుల అస్థికలు, అవశేషాలు కూడా బయటకు వచ్చి చెల్లాచెదురుగా పడిపోతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పవిత్రంగా భావించే శ్మశాన భూమిని సైతం తవ్వి, మృతుల అస్థికలను బయటపడేసి తొక్కించడమే కాకుండా పారవేస్తున్న తీరు మానవత్వానికే మచ్చగా నిలుస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూములు, స్మశానం వాటికలను కాపాడాల్సిన వారే అక్రమార్కులతో కుమ్మక్కయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాలు, మైనింగ్ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ మట్టి మాఫియా చెలరేగిపోతుండటం అధికార యంత్రాంగం వైఫల్యానికి

భూముల పవిత్రతను ధ్వంసం చేస్తూ, మృతుల అస్థికలను సైతం అవమానించే స్థాయికి చేరుకున్న ఈ అక్రమ తవ్వకాలపై జిల్లా యంత్రాంగం, గనుల శాఖ, పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో బి. శ్రీనాధ్ అనే వ్యక్తి కీలక పాత్ర పోషిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా పోలీసుల నుంచి ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. అక్రమ మట్టి తవ్వకాల పేరుతో స్మశాన ప్రాంతాలను కూడా తవ్వుతున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా రాజకీయ పార్టీల ప్రతిష్ఠకు కూడా చెడ్డపేరు తీసుకొస్తాయని అభిప్రాయపడ్డారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా, వాటి వెనుక ఉన్న వ్యక్తులు లేదా వ్యవస్థపై పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి

వాహనదారులు రహదారి నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.సోమవారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో పోలీస్,రవాణా, ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ రాజ్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన 'జిల్లా రహదారి భద్రతా కమిటీ' సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం, అధిక వేగాన్ని నియంత్రించడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం వంటి చర్యలు ప్రమాదాల తగ్గింపుకు కీలకమని తెలిపారు. ముఖ్యంగా యువత రహదారి నియమాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ,మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్‌ను



గుర్తించి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారులపై ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయడం, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. రహదారులపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని, రైతులు ఉపయోగించే ట్రాక్టర్లను కేజీ వీల్స్ (ఇనుప చక్రాలు) తో రోడ్లపై నడపకుండా చర్యలు చేపట్టాలన్నారు.అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన రహదారి భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదం సంభవించినప్పుడు బాధితులను గంటలోపు (గోల్డెన్ అవర్) ఆసుపత్రికి తరలించడం అత్యంత ముఖ్యమని,అలా సహాయం చేసి ప్రాణాలు కాపాడిన వారికి "రహవీర్ అవార్డు"తో పాటు రూ. 25,000 నగదు ప్రోత్సాహకంగా అందజేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.దీనితో పాటు 'పి.యం రాహత్' పథకం ద్వారా రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు రూ. 1.50 లక్షల నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో రోడ్డు సేఫ్టీ నిధుల ద్వారా స్పీడ్ గన్ ల ఏర్పాటు, ఇతర రహదారి భద్రతా అవసరాలకు వినియోగించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్.ఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, విద్యాశాఖ అధికారి రాజేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, జిల్లా ఈ-డార్ మేనేజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు : జెన్నీ కొమ్మినేని

బిఎన్ఎస్ న్యూస్, ఖమ్మం / జూలై 17, ఖమ్మం జిల్లా : ప్రభుత్వ పాఠశాలల ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు అని ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి మరియు జెన్నీ కొమ్మినేని ఉద్ఘాటించారు. పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుర్నవల్లి లో జరిగిన రోల్ మోడల్ ఫర్ గర్ల్ స్టూడెంట్స్ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతము సౌదీ అరేబియాలోని మినిస్ట్రీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ లో ప్రొఫెసర్ గా పని చేస్తున్న జెన్నీ కొమ్మినేని మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకొని ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నట్లుగా చెప్పారు. జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలనే బలమైన ఆకాంక్షతో, అకుంఠిత దీక్షతో కష్టపడితే చక్కటి ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉపాధ్యాయులు ఉన్నారని తద్వారా మంచి విద్యను పొందగలమని చెప్పారు. హెడ్మాస్టర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ జెన్నీ కొమ్మినేని ని ఆదర్శంగా తీసుకొని పాఠశాల విద్యార్థులు చక్కటి లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, దేశ భవిష్యత్తు నిర్మాణంలో పాలుపంచుకోవాలని, పాఠశాలకు ప్రభుత్వ విద్యా వ్యవస్థకు మంచి గుర్తింపు తేవాలని సూచించారు. పిపిటి ప్రెజెంటేషన్ తో విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జెన్నీ కుమ్మినేనిని అభినందించారు ఈ సందర్భంగా జెన్నీ కోమినేని ని, వారి తల్లిదండ్రులను శాలువా మెమెంటో లతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్, ఎపిపిసి చైర్మన్, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు సత్కరించారు.



# ప్రపంచ జనాభా దినోత్సవం - ర్యాలీ



ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడం ద్వారా మాత శిశు ఆరోగ్యం మెరుగుపడటం తో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి, సమాజ ప్రగతికి దోహదపడుతుందని నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాహుల్ తెలిపారు.. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కల్పించేందుకు నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరం లో భారీ ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రణాళిక బద్ధమైన కుటుంబం తో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడి తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు .. పెరుగుతున్న జనాభా వల్ల సమాజంలో ఆరోగ్యం, విద్య, ఉపాధి, సహజ వనరులపై తీవ్ర ప్రభావం ఉంటుందని అన్నారు..

అనంతరం ప్రజల భాగస్వామ్యంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో కుటుంబ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ దీప, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ పద్మా, డాక్టర్ జమీర్, డాక్టర్ తిరుపతిరావు (DMEMO), ఇతర జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ కు సహకరించండి

## రాజకీయ ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



నల్లగొండ (బిఎన్ఎస్) : జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆగస్టు 3 లోగా 100 శాతం పూర్తి చేయడంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. సర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టరేట్ లో జరిగిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం సర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో ఈ లోగా 100 శాతం మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తి చేసేలా అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ప్రతినిధులకు సహకరించాలని కోరారు... బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేసి, వాటిని పూరించడంలో ప్రజలకు సహాయం చేస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు10లక్షల మ్యాపింగ్‌లు పూర్తయ్యాయని, ఇంకా 54 వేల మ్యాపింగ్‌లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. .

మ్యాపింగ్ ప్రక్రియ పూర్తైతే డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల ఓట్లను కూడా ఇంటింటికి వెళ్లి నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# విజయనగరాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా తీర్చిదిద్దండి



విజయనగరం,బిఎన్ఎస్ జూలై 16: విజయనగరం జిల్లాను వెనుకబడిన జిల్లాగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే జిల్లాగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇన్‌చార్జి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలధార--జలహారతి కార్యక్రమం ఫలితంగా జిల్లాలో భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందన్నారు.

జిల్లాలో మొత్తం 8,059 ఎంఐ ట్యాంకులు ఉండగా, వాటిలో 6,447 ట్యాంకుల పనులకు మంజూరు లభించిందని, ఇప్పటికే 6,442 ట్యాంకుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 2,549 కాలువల పనులు కొనసాగుతున్నాయని, ఇందుకోసం రూ.320.62 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. ఈ పనుల ద్వారా 1.28 కోట్ల పనిదినాలు కల్పించడంతో పాటు పూడిక తొలగింపు కారణంగా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి అదనపు ఆయకట్టుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సాగునీటి శాఖ అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్సీ లు గాదె శ్రీనివాసులు నాయుడు, గ్రీష్మ, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బాధితులకు అండగా పోలీస్ అక్క



నల్లగొండ (బిఎన్ఎస్): వేధింపులకు గురవుతున్న బాలికలు మహిళలకు మెరుగైన సహాయ సహకారాలు అందించడం మెరుగైన భద్రత కల్పించడం కోసమే ప్రభుత్వం పోలీసు అక్క అనే వినూత్న కార్యక్రమాన్ని తెచ్చిందని సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు.. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట రూరల్ పోలీసు, జిల్లా షీ టీం పోలీసుల అధ్వర్యంలో సూర్యాపేట లోని తెలంగాణ గురుకుల బాలికల విద్యాలయం లో పోలీస్ అక్క అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి పోలీస్ స్టేషన్కు ఒక మహిళా పోలీస్ అధికారిని పోలీస్ అక్కగా నియమించడం జరిగిందని , ఈ పోలీస్ అక్క మహిళలకు బాలికలకు సొంత అక్క లాగా వారి సమస్యలను విని సమస్యల పరిష్కారానికి కావలసిన సహకారాలు అందించడం చట్టపరంగా చర్యలు తీసుకోవడం లాంటివి చేస్తారనీ అన్నారు. మహిళలు మరియు బాలికలు తమ వ్యక్తిగత లేదా సామాజిక సమస్యలను ఒక కుటుంబ సభ్యురాలికి చెప్పుకున్నట్లుగా వీరికి వివరించవచ్చని. ఆపదలో ఉన్న వారికి, వేధింపులకు గురవుతున్న వారికి చట్టపరమైన సహకారం అందించి, వారికి అండగా నిలవడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు..

